


నేడు మెగా డిఎస్‌సి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

మెగా డిఎస్‌సికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 33,607 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. శుక్రవారం ప్రారంభమై ఈనెల 30 వరకూ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకూ పరీక్ష జరగనుంది. కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్ష జరగనుంది. పరీక్షా కేంద్రానికి ప్రతి అభ్యర్థి హాల్‌టికెట్‌తో రావాలని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్‌తో పాటు, 30 యాక్ట్ అమల్లో ఉందని తెలిపారు.

మామిడి టన్నుకు రూ.12వేలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

మామిడి పంటకు గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పించడంలో వైఫల్యం చెందిందని, ప్రభుత్వం చేసిన నిర్ణయం ప్రకారం టన్నుకు 12వేలు చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం మామిడి రైతుల సమస్యలపై పుత్తూరు ప్రాంతంలో సిపిఎం, ఏపీ రైతు సంఘం ప్రతినిధి బందం పర్యటించి మామిడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు ఫ్యాక్టరీ యజమానులతో,రైతులతో, రైతు సంఘాలతో చర్చించి టన్నుకు 12 వేలు చొప్పున చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినా ఆచరణలో అమలు కావడం లేదన్నారు. గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్ గా మారి మామిడి రైతులతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. జిల్లాలో ఉన్న మామిడి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, టీటీడీ కూడా మామిడి పంటను కొనుగోలు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని, కన్నీరు మున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి రైతులకు సిపిఎం అండగా ఉంటుందని అన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి. హేమలత మాట్లాడుతూ మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులను సమీకరించి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించే వరకు ఆందోళన తప్పదని హెచ్చరించారు. నష్టపోయిన మామిడి రైతాంగాన్ని ఆదుకోవడం కోసం ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి సుబ్రమణ్యం, పుత్తూరు కార్యదర్శి ఆర్ వెంకటేష్, శంకర తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరు మండీలో సిపిఎం, రైతుసంఘాల క్షేత్రస్థాయి పరిశీలన

కక్షపూరిత 'బదిలీ'లు

ఇరిగేషన్ శాఖలో విమర్శల పర్వం

ప్రజాశక్తి - రామచంద్రాపురం



ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు, గాలేరు నగరి సుజల స్రవంతి జలవనరుల శాఖలు ప్రభుత్వ నిబంధనలను నీరుగారుస్తూ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఒ.శారద కక్షపూరిత బదిలీలు చేపట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్లపాటు ఒకే కార్యాలయంలో పనిచేసిన ఉద్యోగులను బదిలీ చేయాలంటూ జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అయితే అప్పటి ఎస్ఇ విజయ్‌కుమార్‌రెడ్డి బదిలీల జాబితా నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని, జాబితాను అప్రూవల్ చేయకుండా మే 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఆ తరువాత ఎస్ఇగా ఒ.శారద (ఎఫ్ఎసి) బాధ్యతలు స్వీకరించారు. అదే శాఖలో డిప్యూటీ ఎస్ఇ గంగాధరరావు 'అయినవాళ్లకు ఆకుల్లో.. కానివారికి కంచాల్లో' అన్న చందాన ఎస్ఇ శారదతో చేతులు కలిపి ఉద్యోగుల బదిలీల జాబితా విడుదల చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఉద్యోగ బదిలీల్లో గంగాధరరావు చక్రం తిప్పుతారని ఉద్యోగ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

జలవనరుల శాఖలో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీసు సబార్డినేట్‌లను తిరుపతిలో ఐదేళ్లు పూర్తయినప్పటికీ రేణిగుంట సబ్‌డివిజన్‌కు బదిలీ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి రేణిగుంట సబ్‌డివిజన్ కార్యాలయం తిరుపతిలోని జలవనరుల శాఖ కార్యాలయం ఆవరణలోనే ఉంది. తిరుపతిలో ఐదేళ్లు పూర్తి చేసిన వీరు రేణిగుంట సబ్ డివిజన్ పేరుతో తిరుపతిలోనే తిరిగి విధులు నిర్వహించేలా బదిలీ సౌకర్యం కల్పించారు. అయితే రేణిగుంట సబ్‌డివిజన్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ కక్షపూరితంగా వెంకటరెడ్డిని శ్రీకాళహస్తికి బదిలీ చేశారు. శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్టిజిపి, జిఎన్ఎస్ఎస్ సబ్ డివిజన్ ఆఫీసులో టెక్నికల్ అసిస్టెంట్ గా 14 నెలలుగా పనిచేస్తున్న వి సాయి వేణుగోపాల్ చౌదరి తిరుపతి సర్కిల్ ఆఫీస్ కి బదిలీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 14 నెలలకే బదిలీ చేయడం ఏంటని పలువురు ఉద్యోగ సంఘ నాయకులు చర్చించుకుంటున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు స్పందించి, ప్రభుత్వ నిబంధనల మేరకే బదిలీలు చేపట్టాలని ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు కోరుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసేందుకు వెనుకాడబోమని, న్యాయ పోరాటం చేస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు బహిరంగంగా హెచ్చరిస్తున్నారు.

నిబంధనల మేరకే బదిలీలు : ఒ.శారద, ఎస్ఇ, జలవనరుల శాఖ, తిరుపతి

ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు, గాలేరు నగరి సుజల స్రవంతి జలవనరుల శాఖలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీవో మేరకే బదిలీలు చేశాం. 14 నెలలు సర్వీసు పూర్తికాకుండానే ఎలాంటి అభ్యర్థన లేకుండా టెక్నికల్ అసిస్టెంట్ వి.సాయివేణుగోపాల్ చౌదరిని ఎందుకు తిరుపతికి బదిలీ చేశారని, వెంకటరెడ్డిని రేణిగుంటలో పోస్టు ఖాళీగా ఉన్నా శ్రీకాళహస్తికి ఎందుకు పంపించారని 'ప్రజాశక్తి' వివరణ కోరగా జాబితాను పరిశీలిస్తానని జారుకోవడం గమనార్హం.

ఐదేళ్లు పూర్తయితేనే : వరప్రసాద్, చీఫ్ ఇంజినీర్

జలవనరుల శాఖలోపనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు ఐదేళ్లు పూర్తయితేనే వేరే చోటకు చేయాలని జీవోలో స్పష్టంగా ఉంది. ప్రభుత్వ గైడ్‌లైన్స్ మేరకే బదిలీ చేయాలని, నిబంధనలు అతిక్రమించి బదిలీ చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి అని ఎస్ఇ ఒ.శారదకు సూచించినట్లు తెలిపారు.


ప్రగతికి మెట్లు... 'చెట్లు'.!

మానవ మనుగడకు 'మొక్కే' ప్రాణం



రేణిగుంటలో..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం



పుత్తూరులో..

'పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యం' అని పర్యావరణ హితం కోరి భారీగా మొక్కలు పెంచాలని వక్తలు ఉద్ఘాటించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సీతమ్మరోడ్డులో ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, కమిషనర్ ఎన్.మౌర్య, అర్బన్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ విజయ్‌కుమార్, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సదాశివం, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్‌సి మునికృష్ణ, కార్పొరేటర్ దూదికుమారి మొక్కలు నాటారు. తిరుపతిలో 5090 మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టామన్నారు. నాటిన మొక్కలను యువకులు, మహిళలు దగ్గరుండి కాపాడుకోవాలన్నారు. బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ థీమ్‌తో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా మార్చాలన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రైతు బజారులో ప్రజలకు గుడ్డ బ్యాగులను కమిషనర్ పంపిణీ చేశారు.

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రేణిగుంట పాత చెక్‌పోస్టు కూడలిలో తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎంఎల్‌ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మతో కలిసి మొక్కలు నాటారు. తుడా వైస్‌ఛైర్మన్ మౌర్య పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. – ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ విస్డం క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా రీజనల్ ప్రెసిడెంట్ తహసున్నిసా బేగం, గౌరవ అతిథిగా జిఎస్‌టి ట్యాగ్గేషన్ ఆఫీసర్ హరి, జిల్లా గ్రేడ్ వన్ అధికారి శివప్రసాద్, తిరుపతి వైస్ ప్రెసిడెంట్ శిరీష, సెక్రటరీ డాక్టర్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ నివారణపై గ్రంథాలయ సమ్మర్ క్యాంపు విద్యార్థులకు అవగామన కల్పించారు.

తిరుమలలో పచ్చదనాన్ని 80శాతానికి పెంచేందుకు చర్యలు చేపట్టాలని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమల గోగర్భం డ్యాంకు సమీపంలోని ఆక్టోపస్ భవనం వద్ద గురువారం ఉదయం మొక్కలు నాటారు. తిరుమలలో వివిధ ప్రాంతాల్లో రెండువేల మొక్కలు నాటుతున్నామన్నారు. డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శ్రీనివాసులు,డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, ఈ ఈ సుధాకర్, ఎఫ్ఆర్వో దొరస్వామి పాల్గొన్నారు.

- **పుత్తూరు టౌన్**...కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర మొక్కలు నాటారు. ప్రగతికి చెట్లు మెట్లువంటివన్నారు. చెట్లను నాటడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకుంటామని, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్స్ జడ్జి కె.రమ్యసాయి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గాలి సురేష్‌బాబు, జానకిరామ్, సంజీవి, శేషాచలం, ప్రభాకర్ పాల్గొన్నారు.

- **రేణిగుంటలో...** మండలం వెదళ్లచెరువు గ్రామంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హేమావతి, మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

- **వరదయ్యపాలెంలో...** శ్రీసిటీలో ఆరో విడత మియావాకి మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తిరుపతి జోనల్ కార్యాలయం సీనియర్ పర్యావరణ ఇంజినీర్ ఎస్ఎస్ మురళి ముఖ్య అతిథిగా విచ్చేశారు. శ్రీసిటీ ఉద్యానవన విభాగ అధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆరో విడత 8వేల మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసిబి పర్యావరణ ఇంజనీర్ సుధీర్, శ్రీసిటీ పర్యావరణ ఇంజనీర్ డాక్టర్ వెంకట్ పాల్గొన్నారు.

క్లస్టర్ రోడ్డును పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ విస్తరణ పనుల్లో భాగంగా తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల సరిహద్దుల నడుమ నిర్మిస్తున్న క్లస్టర్ రోడ్డు నిర్మాణ పనులను గురువారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో రెండు మండలాల మధ్య ఏవైనా భూ వివాదాలు ఉన్నాయా..! అంటూ ఆరా తీశారు. ఇప్పటికే నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న మదనపల్లి –నాయుడుపేట జాతీయ రహదారిని, త్వరలో నాలుగు లేన్ల జాతీయ రహదారిగా విస్తరించనున్న కేటీ రోడ్డును కలుపుతూ ఈ క్లస్టర్ రోడ్డు నిర్మితమవనుంది. తొట్టంబేడు మండలంలోని రౌతు సూరమాల, బుచ్చినాయుడు కండ్రిగలోని పెల్లేటివారి కండ్రిగ, ఆలత్తూరు గ్రామాల మీదుగా పల్లమాల వరకు సుమారు 9.2 కిలోమీటర్ల మేర క్లస్టర్ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ రోడ్డు నిర్మాణానికి రూ.72 కోట్లు వెచ్చించింది. ప్రస్తుతం పనులు ప్రాథమిక దశలో ఉన్నాయి. రౌతు సూరమాల పరిధిలో 2300 ఎకరాలను ఏపీఐఎసి సేకరించి విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడారుకు అప్పగించింది. బుచ్చినాయుడుకండ్రిగ మండల పరిధిలో కొంతమేర భూసేకరణ పెండింగ్ లో ఉందని కలెక్టర్ తెలిపారు. క్లస్టర్ రోడ్డు నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయడంతో పాటు భూ వివాదాలను కూడా పరిష్కరించాలంటూ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

టీటీడీ సీవీఎస్వోగా మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - తిరుమల



టీటీడీ ముఖ్య నిఘా, భద్రతాధికారిగా కే.వీ.మురళీకృష్ణ గురువారం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సీవీఎస్వో రంగనాయకులు మండపంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సీవీఎస్వోకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు సీవీఎస్వో వెంకట శివకుమార్ రెడ్డి, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.



పవన్ కల్యాణ్‌ను కలిసిన పసుపులేటి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళ అభివద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ హస్త కళాభివద్ధి కార్పొరేషన్ ఛైర్మన్గా బాధ్యతలు తీసుకున్న ఆయన, మొదటిసారిగా జనసేన పార్టీ కేంద్రం కార్యాలయంలో డిప్యూటీ సీఎంను కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

మంగళం కాలువ పోరంబోకు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి అర్బన్ పరిధిలోని మంగళంలోని సర్వే నంబర్ 114/2 లో కాలువ పరంబోకు భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ భాగ్యలక్ష్మి 'ప్రజాశక్తి'కి తెలిపారు. కొంతమంది లేఔట్ లో ప్రవేశించి కబ్జాకు ప్రయత్నించి రాళ్లు నాటుతున్నట్లు తమ దష్టికి వచ్చిందని, వాటిని తొలగించడం జరిగిందన్నారు. కబ్జాదారులు ఎవరైనా కాలువ పరంబోకు భూమిని ఆక్రమించిన వారిపై కేసులు పెట్టి జైల్లో పెట్టిస్తామని హెచ్చరించారు.

ఆర్ఐఓగా రాజశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆంధ్రప్రదేశ్ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ తిరుపతి జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా జి.రాజశేఖర్ రెడ్డిని నియమించింది. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చంద్రగిరి బాలికల కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నారు. అలాగే తిరుపతి జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాల ఇంటర్ బోర్డు నియమాలు, విధి విధానాలు తప్పనిసరిగా పాటించాలి అని కోరారు. అడ్మిషన్స్, కళాశాల లో సౌకర్యాలు, ఇంటర్ బోర్డు నియామవాళి ప్రకారం పాటించాలి అని సూచించారు. ఇంటర్ బోర్డు నియమావాళి అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల లో అడ్మిషన్స్ పెంచేందుకు ప్రిన్సిపాల్స్, కళాశాల అధ్యాపకులు కషి చేయాలి అని సూచించారు. అన్ని యాజమాన్య కళాశాలలలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు యోగా తరగతులు జరపాలని, యోగాంధ్ర ప్రోగ్రామ్‌ను జయప్రదం చేయాలని సూచించారు.


కోచింగ్ మాఫియాతో కళాశాలలు కుమ్మక్కు : ఎస్ఎఫ్ఐ



కోచింగ్ మాఫియాకు పాల్పడుతున్న కళాశాలల గుర్తింపును రద్దు చేయాలను కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్ఐఓకు వినతిపత్రం అందజేశారు. ఆర్ఐఓ కార్యాలయంలో గురువారం ఆయనను కలిసిన ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ జూనియర్ కాలేజీలు కోచింగ్ సెంటర్ల మాఫియాగా పాల్పడుతున్నటువంటి రాజు జూనియర్ కాలేజ్(09382) , బివికె విద్య సంస్థలు , మేడ్జి జూనియర్ కాలేజ్(09053) , గీతం జూనియర్ కాలేజీ (09129)లను వెంటనే సీజ్ చేయాలన్నారు. ఈ కళాశాలలు అలెన్ , అన్ అకాడమీ , ఆకాష్ లాంటి జెఈఈ – నీట్ కోచింగ్ సెంటర్ల రూపంలో ఉన్న "కోచింగ్ మాఫియా "లతో కుమ్మక్కై లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలకు వ్యతిరేకం గా వ్యవహరిస్తున్నటువంటి ఈ కళాశాలల పైన సమగ్ర విచారణచేసి, సీజ్ చేసి, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, జిల్లా కార్యదర్శి భగత్ రవి, వినోద్ కుమార్, వీరేష్, రవి, తిమ్మప్ప, మల్లి తదితరులు పాల్గొన్నారు.

రూరల్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు. అంతేకాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 16 అంశాలతో కూడిన బోర్డును పరిశీలించారు. బోర్డు పైన ఉన్న కేసులో పురోగతి లేదని కేసుల విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. పాత కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక టీం లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కర వేదిక నుండి వస్తున్న పిటిషన్స్ విచారణ వేగవంతంగా చేయాలన్నారు. మన వద్ద సహాయం కోసం వస్తున్న ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. ఉపేక్షించేదిలేన్నారు. పోలీసు స్టేషన్ వద్ద నిలబడిన పిటినర్స్ తో ఎస్పీ మాట్లాడారు. బాధితులు చెప్పిన విషయాలను పూర్తిగా విని వారికి న్యాయం చేసే విధంగా వేంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు స్టేషన్ సిబ్బందికి ఆదేశించారు. న్యాయం కోసం వస్తున్న వారిని ఎక్కువ సమయం బయట నిలబడినట్లు మరోసారి నాకు కనబడితే చర్యలు తప్పవన్నారు. పోలీస్ స్టేషను పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా పోలీసు సిబ్బందిని ఎస్పి ఆదేశించారు.

తుడా లేఔట్లలో మౌలిక సదుపాయాలు కల్పించండి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ ఏర్పాటు చేసిన లేఔట్లలో ప్రజలకు అవసరమయ్యే మౌళిక సదుపాయాలు కల్పించాలని ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళం సమీపంలో ఏర్పాటు చేసిన శేషాచల హిల్ వ్యూ లే అవుట్ ను గురువారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ లేఔట్ నందు అన్ని సదుపాయాలు కల్పించాలని అన్నారు. లే అవుట్ నందు అనధికారిక నిర్మాణాలు, ఆక్రమణలు జరగకుండా చూడాలని అన్నారు ఎస్.హెచ్.వి. లే అవుట్ నందు పార్కులను పరిశీలించి ఆక్రమణలకు గురి కాకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, ఈ.ఈ.రవీంద్ర ఉన్నారు.

రేణిగుంట గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ ముగింపు

ప్రజాశక్తి -రేణిగుంట

రేణిగుంట గ్రంథాలయంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. దేశభక్తి గేయాలాపన, డ్రాయింగ్, పద్యం భావం, కథలు చెప్పడం, వ్యాసరచన,క్విజ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి కుప్పస్వామి మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలు, పాటలు ఉండాలని, మంచి విలువలు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు రుషేశ్వర్, పూజిత, జాస్మిన్, భార్గవి,రిజ్వానా, భరత్, రామ్, కార్తీక్, భానుప్రకాష్, భాస్కర్, శ్రీకావయ పాల్గొన్నారు.

పాట ఉన్నంత వరకూ 'సజీవం'

ఆకట్టుకున్న బాలూ జ్ఞాపకాల్లో 'ఓ సాయంత్రం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



పాట ఉన్నంతవరకు ప్రజల గుండెల్లో దిగ్గజ గాయకుడు, పద్మ విభూషణ్ ఎస్‌పి బాలసుబ్రమణ్యం సజీవంగా ఉంటారని వక్తలు కొనియాడారు. బాలసుబ్రమణ్యం సమైక్య వాదిగా, ప్రజా కవిగా జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారంటూ కీర్తించారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతిని పురస్కరించుకుని స్థానిక జెడ్పి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం రాత్రి ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో బాలూ జ్ఞాపకాల్లో ఓ సాయంత్రం పేరిట పాటల పోటీలు నిర్వహించారు. చిత్తూరు, నెల్లూరు రెండు ఉమ్మడి జిల్లాల నుంచి 55 మందికి పైగా గాయకులు పోటీల్లో పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన పోటీలు గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. వర్ధమాన గాయకులు బాలూ జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సోలో, డ్యూయెట్ సాంగ్ లతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ప్రథమ బహుమతిని టీ.నందిని(శ్రీకాళహస్తి), ద్వితీయ బహుమతిని ఎం.శివకుమార్(చంద్రగిరి), తృతీయ బహుమతిని పి.విజయకుమార్(నెల్లూరు), కన్సోలేషన్ బహుమతిని రూపేష్ (శ్రీకాళహస్తి) గెలుచుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా ఏ జగన్మోహన్ రావు, డాక్టర్ ఆమూరి సుబ్రమణ్యం, ఎం.కవిత లు వ్యవహరించారు. ప్రభు ల్యాబ్ ప్రోపరైటర్ మురళి నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రజానాట్యమండలి శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి గెడి వేణు, కే సెల్వ రాజు, కే హరికృష్ణ. కె గురునాథం, వై కుమార్, జి. సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో స్విమ్స్ కాంట్రాక్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

స్విమ్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి రెండేళ్లుగా యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కరించకపోవడంతో, అనివార్యంగా గురువారం నుంచి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నట్లు స్విమ్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వేణుగోపాల్, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వి.సూరి, జి.రవి పేర్కొన్నారు. ఇప్పటికైనా స్విమ్స్ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో, 14 రోజుల తరువాత నిరవధిక సమ్మెలోకి వెళతామన్నారు. వేతనాలు పెంచాలని, శానిటేషన్ పేరు మార్చాలని, కార్మికులను శ్రీలక్ష్మీ శ్రీనివాస మేన్ ఫోర్ కార్పొరేషన్‌లోకి తీసుకోవాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రన్నర్స్‌గా చిత్తూరు జట్టు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గుంటూరు వేదికగా జేశాప్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లాల అక్రిడిటేషన్ జర్నలిస్టుల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు రన్నర్స్ గా నిలిచింది. కప్ గెలవకున్నా అభిమానుల మనసు మాత్రం గెలుచుకుంది. గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో ఆదివారం మధ్యాహ్నం ఉమ్మడి చిత్తూరు, ఉమ్మడి కడప జిల్లా జట్లు ఫైనల్లో తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన కడప జట్టు 16 ఓవర్లకు గాను 169 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ప్రతిగా చేధనకు దిగిన చిత్తూరు జట్టు చేధనలో చతికిల పడింది. బ్యాటర్లు విఫలం కావడంతో ఏ దశలోనూ లక్ష్యం చేరుకునే పరిస్థితి కనిపించలేదు. 16 ఓవర్లకు 135 పరుగులే చేసి ఓటమిని అంగీరించింది. అంతకముందు ఆదివారం ఉదయం జరిగిన ఉత్కంఠకరమైన సెమీఫైనల్ మ్యాచ్ లో అత్యంత బలిష్టమైన వెస్ట్ గోదావరి జట్టును చిత్తూరు జట్టు ఓడించి ఫైనల్ కు చేరుకుంది.



'వెన్నుపోటు దినం' అట్టర్ ఫ్లాప్
: ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గత ఐదేళ్ల వైసిపి పాలనపై నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మండిపడ్డారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి రోజా చేసిన అక్రమాలు, కుంభకోణాలు, ఆగడాలకు సమాధానం చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. వైసిపి నాయకులు బుధవారం ఏదో చేయాలని వచ్చి, టీ కప్పులో తుపాను సృష్టించాలని ఎద్దేవా చేశారు. అతి తక్కువ కాలంలోనే ప్రజలకు అందిస్తున్న పథకాలు వైసిపి కళ్లకు కనపడలేదని ప్రశ్నించారు. వారు వెన్నుపోటు దినం అంటూ చేసిన కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో తోకముడిచారన్నారు. ఇప్పటికి కూడా వైసిపి నాయకులు బుద్ధి రాలేదని, కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు చీత్కరించుకున్నప్పటికి వాళ్లలో మార్పు రాలేదన్నారు. నెలకు 5 వేలు ఇచ్చే వాలంటీర్ల ఉద్యోగాలు ఇచ్చి, వారిని మరెక్కడా ఉద్యోగావకాశాలు లేకుండా దగా చేశారని విమర్శించారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో రూ. 5 వేలతో కుటుంబాన్ని ఎలా పోషించగలరని ప్రశ్నించారు. వైసిపి నాయకులు ఒక గంజాయి స్మగ్లర్, ఆకతాయి కోసం ఓదార్పు యాత్ర చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనికి తోడు నగరిలో మాజీ మంత్రి రోజా తందాన తాన వంతపాడుతున్నదని, రాష్ట్ర ప్రజలు ఏమి మరవలేదని, చేసిన కుంభకోణాలు, అక్రమాలు అన్నింటికి సమాధానం చెప్పాల్సిన పరిస్థితి దగ్గరలోనే ఉందని హెచ్చరించారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పుత్తూరు మండలంలో గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ ఆధునీకరణ ద్వారా రైతు సాధికార కోసం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధాకర్ చెప్పారు. ఈ సందర్భంగా తొరూరు, అమరం కండ్రిగ గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకొని పంట సాగులో స్థిరమైన పద్ధతులు, శాస్త్రీయతపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు రైతులకు భూసారం, విత్తన, ఎరువుల వినియోగం, డ్రోన్ల ఉపయోగాలు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి దివాకర్, గ్రామ వ్యవసాయ సహాయకులు మురళి, శిరీష, లావణ్య, సెల్వం, తరుణ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామ సర్పంచ్ వసంతమ్మ, పలువురు రైతులు పాల్గొన్నారు.

కోవిడ్‌పై మాక్ డ్రిల్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉదయం కోవిడ్ మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. తిరుపతి జిల్లాలో మొట్టమొదటిగా కేసును నమోదు అయిన సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మాధవి, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ కోవిడ్ నుండి రక్షణ సూచనలు తెలియజేశారు.

పుట్టగొడుగుల విత్తన తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్, రామచంద్రపురం (చంద్రగిరి): శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల దత్తత గ్రామం అయిన దోర్నకంబాలలో అగ్రిక్ ఆన్ మష్రూమ్, తిరుపతి కేంద్రం తరపున రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని దోర్నకంబాలలో ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణశ్రీ, సంధ్య పుట్టగొడుగుల విత్తన తయారీపై, పుట్టగొడుగుల ప్రాముఖ్యత, పుట్టగొడుగుల పెంపకం గురించి వివరించారు. ఇందులో నలభై మంది పైగా గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టగొడుగుల విత్తనం, పంపకంపై గ్రామస్తుల అడిగిన సమస్యలకి కళాశాల సిబ్బంది సరైన సూచనలు ఇచ్చారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక త్యాగరాజవీధి, శ్రీ కన్యకాపరమేశ్వరీ స్వామి దేవస్థానములో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ ఆంధ్రమహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతలుగా డాక్టర్ రోహిణి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తనూజ, శశిరేఖ, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.

అండగా నిలబడండి : ఉచిత సేవకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తమకు అండగా నిలబడాలని శ్రీకాళహస్తీశ్వరాలయ ఉచిత సేవకులు గురువారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. 2014 నుండి ఉచిత సేవకులుగా పనిచేస్తున్న 12 మందికి వేతనాలు ఇవ్వకుండా ఆలయ అధికారులు అన్యాయం చేస్తున్నారంటూ వాపోయారు. గత ట్రస్ట్ బోర్డు ఉచిత సేవకులకు వేతనాలు ఇవ్వాలని దేవదాయ శాఖకు విన్నవించడంతో, అందుకు ఆమోదం తెలుపుతూ కమిషనర్ జీవో జారీ చేశారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమను పక్కనపెట్టి, కొత్తవారిని విధుల్లోకి తీసుకున్నారంటూ వాపోయారు. పుల్లయ్య స్పందిస్తూ కార్మికులు, పీడితుల పక్షాన సీఐటీయూ ఎప్పుడూ అండగా ఉంటూ పోరాడుతుందని హామీ ఇచ్చారు.

రేపు జాబ్ మేళా

ప్రజాశక్తి - కోట: కోట మండలం విద్యానగర్ కి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ అన్ బిన్ సువిధాల్ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 7వ తేదీన విద్యానగర్ కొత్తపాలెం రోడ్డులోని శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో చెన్నై కి చెందిన ఐ మేక్యూ సొల్యూషన్స్ వారిచే జాబ్ మేళా జరుగుతుందని అన్ బిన్ సువిధాల్ సంస్థ డైరెక్టర్ భూపతి మోహన్ సాయి తెలిపారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. 7 వ తేది ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు రెజ్యూమ్ తో పాటు వారి సర్టిఫికెట్లను తీసుకొని రావాలని తెలియజేశారు.

ఘనంగా ఖరీఫ్ విత్తన దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం ఖరీఫ్ విత్తన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డా.వి.సుమతి పాల్గొని నూతన విత్తనాల ప్రాముఖ్యతను వివరించారు. పంటల ప్రజనన విభాగాధిపతి డా.కె.జాన్ నూతన వేరుశనగ, ఆహారాలు, నువ్వులు, చిరుధాన్యాలలో ఖరీఫ్ పంట కాలానికి అనువైన నూతన రకాల గుణగణాలు, వాటి ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. పంటల కీటక శస్త్ర విభాగాధిపతి డా.టి. మురళీకృష్ణ విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల నుండి విచ్చేసిన రైతులకు వేరుశనగ, అనుములు, రాగుల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా. భారతి, డా. అమరావతి, డా. శ్రీవల్లి దేవి, డా. మహేశ్వరరెడ్డి, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నా స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



కబ్జా చేయాలని చూస్తున్న వారి ఫోటోలను చూపుతున్న బాధితుడు మవిల్లయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తనకు అనువంశికంగా వచ్చిన భూమిని కొంతమంది ఉద్దేశపూర్వకంగా నకిలీ డాక్యుమెంట్లను తయారు చేయించి కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ప్రధానోపాధ్యాయులు మవిల్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కె.వి.బి.పురం మండలం, రాయపేడు గ్రామం లెక్క దాఖలా సర్వేనెంబర్ 164/15లో 48 సెంట్లు భూమి తనకు వంశపార్యపర్యంగా సంక్రమించిందన్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం అనుచరులుగా చెప్పబడే జాన్సన్, శరత్ కుమార్, చటర్జీ, బసవయ్య, దొరస్వామి, మనీ, ఎలుమలై అనే వ్యక్తులు కే వి బి పురం మండలంలో నోషనల్, డీకేటి ఖాతాలకు సంబంధించిన భూముల వివరాలను సేకరించి ఆ భూములను రికార్డులు తారుమారు చేస్తూ, తప్పుడు డాక్యుమెంట్లను తయారు చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారని తెలిపారు. గతంలో తహసిల్దార్‌గా పనిచేసిన ద్వారకనాథరెడ్డి ఇచ్చిన ఎండార్స్మెంట్ వలన తన భూమికి సంబంధించి కోర్టు వివాదాల్లో ఉందని, కోర్టు ఉత్తర్వుల మేరకు తగు నిర్ణయం తీసుకుంటామని ఎండార్స్మెంట్ లో పేర్కొన్నారన్నారు. దీంతో తన 1బి అడంగల్‌ను అధికారులు హోల్డ్‌లో ఉంచారన్నారు. తన భూమికి సంబంధించి హోల్డ్ నుండి విముక్తి కల్పించాలని కోరుతున్నానన్నారు.

ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా లక్ష్మీపతి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మూడవసారి అటవీ క్షేత్రాధికారి ఎన్. లక్ష్మీపతి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రామచంద్రరావు ప్రకటించారు. విజయవాడ ఎస్ ఎస్ కన్వెన్షన్‌లో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో రాష్ట్ర అధ్యక్షులుగా కె.ఆర్. సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా నాగసాయి, కోశాధికారిగా రామారావులను ఏకగ్రీవంగా ఎన్నిక కాబడ్డారన్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, శాసనమండలి సభ్యులు రాజశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఎన్నిక ఉపఎన్నికల అధికారిగా భుజంగరావు, పరిశీలకులుగా ఆయుష్ వ్యవహరించారన్నారు.

విద్యార్థి మిత్ర స్టాక్ వివరాలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): విద్యార్థి మిత్ర స్టాక్ వివరాలను సక్రమంగా నిర్వహించాలని డిప్యూటీ డైరెక్టర్ ఎస్ అనురాధ సూచించారు. చంద్రగిరి, శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలోని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ ని సియంఓ సురేష్‌తో కలిసి ఆమె సందర్శించారు. స్టాక్ పాయింట్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యంఈఓ 2 శ్రీ భాస్కర్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్, ఎం ఐ ఎస్, డిటిఓ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి పరిధి, నార్త్ సెక్షన్‌లో గల 33/ 11 కె.వి అలిపిరి సబ్ స్టేషన్ లో 11కె.వి స్విమ్స్ ఫీడర్ విద్యుత్ మరమ్మతులు కొరకు, ఎక్స్టెన్షన్ వర్క్ కొరకు 6తేది శుక్రవారం నాడు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపిఎస్పీడిసిఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈఈ విన్నకోటి చంద్ర శేఖర్ రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున 11 కె.వి మెడికల్ కాలేజి , బర్డ్స్ హాస్పిటల్, మెటర్నిటి హాస్పిటల్, స్విమ్స్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల వినియోగదారులు అంతరాయన్ని గమనించి సహకరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపచేద్దాం



ప్రజాశక్తి - రామచంద్రపురం : ఆంధ్ర ప్రదేశ్ రైతు సాధికార సంస్థ చేపట్టిన ప్రకృతి వ్యవసాయ సాగును వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు అందరి రైతుల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయ సాగును విస్తరింప చేద్దామని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సికేపల్లి పంచాయతీ చిట్టత్తూరులో ఈశ్వరయ్య వ్యవసాయ క్షేత్రాన్ని డివిజనల్ అధికారులు, జిల్లాఉద్యానవన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు పరిశీలించారు. షణ్ముగం ఆధ్వర్యంలో 45 మంది వ్యవసాయ అధికారులు, సభ్యులతో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఒకటైన ఏటీఎం మోడల్‌ను సందర్శించి మోడల్ వేసిన విధానం, పద్ధతులు, ఖర్చు రాబడి వంటి విషయాలను తెలుసుకున్నారు. ఢిల్లీ అనే రైతు పొలంలో వేసిన పిఎండిఎస్ విధానాలను పరిశీలించి, ఉష్ణోగ్రతలు, భూమిలో తేమశాతం పరిశీలించారు. రైతు రామకృష్ణారెడ్డి మామిడిలో ఏటీఎం మోడల్ వేసే విధానాన్ని పరిశీలించి విత్తనాలు నాటారు. ఈ కార్యక్రమంలో ధనంజయ రెడ్డి, రవిచంద్ర, ప్రసాద్, పట్టాభిరెడ్డి, నీలమ్మ, విమల, గీతారాణి, మల్లికార్జున్, స్వామి కొండయ్య, రాధా, ఎంటిలు, యూనిట్ ఇన్చార్జులు, ఐ సి ఆర్ పి లు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఓజిలి: విద్యుత్ షాక్ తగిలిన బాధితులకు గ్రామస్తులు కొండంత అండగా నిలిచి నాలుగున్నర లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వం చాటుకున్నారు. మండల పరిధిలోని ఆరిమేనుపాడు గ్రామంలో ఇటీవల నిర్వహించిన శ్రీ ముంగమూరి పరమేశ్వరీ అమ్మవారి 10వ వార్షికోత్సవ వేడుకల్లో అపశృతి చోటుచేసుకుని ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి విద్యుత్ షాక్ తగిలి గాయాలైన సంఘటన విధాతమే. గ్రామంలో అందరూ కలిసి మాట్లాడుకుని వారికి తోచిన రీతిలో నగదు రూపంలో సేకరించి అలాగే స్ఫూర్తి సేవా సంస్థ ద్వారా పదిహేను వేల రూపాయలు ఆర్థిక సాయం చేయగా దాదాపు నాలుగున్నర లక్షల రూపాయలు గ్రామస్తులు సమకూర్చి విద్యుత్ ప్రమాదానికి గురైన బాధితులకు ఆరిమేను పాడు గ్రామస్తులు తరపున గురువారం వారికి అందజేశారు.

ప్రజా తీర్పును అవమానించడమే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వం కొలువు దీరిన రోజున జగన్ విద్రోహ దినంగా పేర్కొంటూ నిరసన తెలపడం ప్రజా తీర్పును అవమానించడమేనని బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ను నమ్మి ప్రజలు అధికారం ఇచ్చిన పాపానికి నాసిరకం మద్యం సరఫరా చేసి, వేల కోట్ల రూపాయలు దోచుకొని అదే పేదల ప్రాణాలు బలితీసుకున్న జగనాసురుడిపై కష్ట జీవులు విజయం సాధించిన సుదినం జూన్ 4 అని గుర్తు చేశారు. మరోసారి జగన్ కు ప్రజలు ఓటు ద్వారానే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడంపై తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ బాలకృష్ణ నాయక్, జిల్లా వైద్య శాఖాధికారి ఆదేశానుసారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ బీట్ ప్లాస్టిక్ నినాదంతో కాలుష్య నివారణకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

భవిష్యత్ తరాలకోసం పర్యావరణ పరిరక్షణ అవసరం



మొక్కలు నాటి నీరుపోస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, చిత్రంలో ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - కేవీబీపురం: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజక వర్గం, కెవిబిపురం మండలం, బై రాజు కండ్రిగలో గురువారం వన మహోత్స వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కైలాసగిరి నందనవనంలో చెట్లు నాటారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, మాధవమాల ఎస్ డబ్ల్యూ పిసి, ఏర్పేడు స్మశాన వాటిక, పాఠశాల, ఏర్పేడు సచివాలయం వద్ద ఎంపీడీవో సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు, ఉపాధి కూలీలు, గ్రామస్తులతో కలిసి గురువారం మొక్కలు నాటి నీరు పోశారు. అలాగే పాపానాయుడు పేట జూనియర్ కాలేజీ ఆవరణలో లెక్చరర్ ఉమా, వెంకటేష్, టిడిపి నాయకులు, బండారుపల్లిలో ఉపాధి సిబ్బందితో కలసి రెడ్డివారి గురువారెడ్డి మండల పరిధిలోని గ్రామాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు.

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: హరితాంధ్రప్రదేశ్లో భాగంగా గురువారం మండల కార్యాలయాల సముదాయంలో తహసిల్దార్ జనార్ధన్ రాజు, ఎంపీడీవో గిడ్డయ్య, ఎంఈఓ సత్యనారాయణ, ఈఓఆర్డి చంద్రశేఖర్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి శివకుమారి, వ్యవసాయ అధికారి ధనలక్ష్మి, ఏపీవో భార్గవి, సిబ్బంది చెట్లు నాటి "పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ" చేశారు.

ప్రజాశక్తి -దొరవారిసత్రం : పర్యావరణాన్ని కాపాడుకుందామని దొరవారిసత్రం ఎంపీడీవో గోవర్ధన్, నేలపట్టు పక్షుల కేంద్రం ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ సౌజన్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో రెండు వేల చెట్లను నాటారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో క్రై – బెంగళూరు వారి సహకారంతో ఏర్పేడు మండలం, పాపా నాయుడుపేట క్లస్టర్‌లో రావిళ్ళ వారి కండ్రిగ, బత్తినయ్య కాలనీ, గోవిందవరం ఏర్పేడు క్లస్టర్లోని చింతలపాలెం, బండారుపల్లి, పల్లాం గ్రామాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాద్యతగా భావించి, ప్రతి వ్యక్తి కనీసం ఒక్క మొక్కనైనా నాటాలని తహశీల్దార్ శ్రీదేవి పిలుపునిచ్చారు. బుచ్చినాయుడు కండ్రిగ మండల కార్యాలయం ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటరత్నమ్మ పర్యావరణ రక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పర్యావరణ పరిరక్షణతో ప్రతి ఒక్క వ్యక్తికి పరిపూర్ణమైన ఆరోగ్యం ఏర్పడుతుందని సత్యవేడు ఎమ్మెల్యే తనయుడు నారాయణ వనం జడ్పిటిసి చిత్తూరు జిల్లా ఉమ్మడి జెడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్ కుమార్ తెలిపారు. గురువారం నారాయణవనం బాలికల ఉన్నత పాఠశాల భీముని చెరువు గ్రామంలో చెట్లు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. తడుకు గ్రామపంచాయతీ, వేణుగోపాల పురంలో గురువారం ఉపాధిహామీ సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.



మొక్కనాటి నీరుపోస్తున ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రతి ఒక్కరూ హరితాంధ్రప్రదేశ్‌కు తోడ్పడాలని ఎమ్మెల్యే సునీల్ కుమార్ సూచించారు. గూడూరు, అశోక్ నగర్ పార్కులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. గూడూరు రెండో పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ గూడూరు ఆధ్వర్యంలో 7వ అదనపు జిల్లా జడ్జి కె.వెంకట నాగ పవన్, సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బివి.సులోచన రాణి చేతుల మీదుగా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు.

ప్రజాశక్తి - బాలాయపల్లి : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజీవని కాటంబేడు సచివాలయంలో గురువారం వివిధ రకాల మొక్కలు నాటారు. మొక్కలు మానవాళికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కైనా నాటాలని సూచించారు.



ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు స్థానిక పున్నమి సర్కిల్‌లో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ క్యాంపస్‌లోని, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ఇంచార్జీ ఉపకులపతి ఆచార్య చిప్పాడ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ఆచార్య మురళీధర్, ఆచార్య దామోదరం విద్యార్థులు పాల్గొన్నారు. తిరుపతి వెటర్నరీ కళాశాలలో విద్యార్థుల "తల్లులను" ప్రత్యేకంగా ఆహ్వానించి, పిల్లలతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. శ్రీ పద్మావతి మహిళ డిగ్రీ, పీజీ కళాశాల, అటవీశాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణంలో గురువారం మొక్కలు నాటారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం/చంద్రగిరి: పర్యావరణ పరిరక్షణ చేపడదామని తొండవాడ కూటమి పార్టీల నాయకులు పి. మోహన్ రెడ్డి, టీ,మురళి రెడ్డిలు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చంద్రగిరి మండలంలోని తొండవాడలో కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, గ్రామ సచివాలయం సిబ్బంది చేతుల మీదుగా చెట్లను నాటి నీరు పోశారు. అలాగే రామచంద్రపురం మండలం, అనుపల్లెలో పంచాయతీ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.



మొక్కనాటి నీరు పోస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - నాయుడుపేట: పర్యావరణ పరి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, అందరూ విధిగా మొక్కలు నాటడం అలవాటు చేసుకుని పర్యావరణాన్ని కాపాడాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఎస్ కే పజిల్లుల్లా ఆధ్వర్యంలో పట్టణంలో ఏ ఎల్ సి ఎం హై స్కూల్ ఆటస్థలంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ టీడీపీ అధ్యక్షులు షేక్ రఫీ, పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పై దాడి అంటూ ప్రచారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌పై, కూటమి నేత అనుచరుడు దాడికి దిగినట్లుగా సోషల్ మీడియాలో గురువారం ప్రచారం జరిగింది. అయితే ఇది పూర్తిగా అవాస్తవం అంటూ శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి సోషల్ మీడియా ద్వారా మీడియాకు తెలియజేశారు. అలాంటి ఘటనేదీ జరగలేదని స్పష్టం చేశారు. అయితే బయట మాత్రం ఇందుకు భిన్నంగా కథనాలు వినిపిస్తుండడం గమనార్హం.

క్రైం న్యూస్

పాఠశాలలో ఆఫీస్ గది దగ్ధం



ప్రజాశక్తి -కోట : కోట మండలం, ఉత్తమ నెలూరు, ప్రాథమికోన్నత పాఠశాలలో ఆఫీస్ గది దగ్ధమైనట్లు ఉపాధ్యాయులు మండల విద్యాశాఖధికారి దారా మస్తానయ్య పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వేసవి సెలవుల్లో పాఠశాలకు ఉపాధ్యాయులు తాళాలు వేసుకునివెళ్లారని, అయితే బుధవారం పాఠశాలలో నిర్వహించనున్న సంసిద్ధత కార్యక్రమంలో భాగంగా, ఆఫీస్ గది తెరిచి చూడగా గది మొత్తం దగ్ధమై ఉందని తెలిపారు. అందులోని ఐఎఫ్‌పి ప్యానెల్‌తోపాటు సంబంధిత వస్తువులు కూడా పూర్తిగా కాలి బుడిదై కనిపించడంతో వెంటనే మండల విద్యాశాఖాధికారికి సమాచారం అందించడంతో, ఉన్నతాధికారులు సూచనల మేరకు పోలీసులకు పిర్యాదు చేశామని తెలిపారు. ఈ సంఘటనపై విచారణ జరిపించాలని పోలీసులను కోరారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి



మృతి చెందిన సోమయ్య (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి ఓ తాపీ మేస్త్రి దుర్మరణం పాలైన సంఘటన శ్రీకాళహస్తి రూరల్ మండలం మదనపల్లి–నాయుడుపేట జాతీయ రహదారి కాపుగున్నేరి సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం చోటుచేసుకుంది. నారాయణపురం గ్రామానికి చెందిన సోమయ్య(36) తాపీ మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మన్నసముద్రం గ్రామంలో తాపీ మేస్త్రిగా తాను పూర్తిచేసిన ఓ ఇంటి గృహప్రవేశానికి వెళ్లి ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా కాపుగున్నేరి సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో సోమయ్య అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మృతుడికి భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ రవి నాయక్ తెలిపారు.

తాపీ మేస్త్రీ ఆత్మహత్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉరి వేసుకుని తాపీ మేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని ముత్తరాశిపాలెంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. టూ టౌన్ సీఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. ముత్తరాశిపాలెంకు చెందిన ధనంజయులు (42) తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్యానికి అలవాటు పడ్డ ధనంజయులు రెండు రోజుల కిందట అతని భార్యతో గొడవపడ్డాడు. ఈ కారణంగా అలిగిన ఆమె వారి పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆయన బుధవారం అర్ధరాత్రి అందరూ పడుకున్న తర్వాత ఇంట్లోనే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వెంటనే గుర్తించిన కుటుంబీకులు ధనంజయులను శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసులపై దాడిచేసిన యువకుల అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పోలీసులపై దాడి చేసిన ఘటనలో మంగళం బిటిఆర్ పురంలో నివాసం ఉండే నలుగురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వివరాల్లోకెళితే మంగళం పంచాయతీ బిటిఆర్ పురంలో మంగళవారం రాత్రి జరిగిన జాతరలో స్థానికంగా ఉన్న కొంతమంది యువకులు మద్యం సేవించి రోడ్లపై తిరుగుతుండడంతో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. అయితే మద్యం మత్తులో ఉన్న మనోహర్, ప్రవీణ్, ప్రేమ్, విన్నీ అనే యువకులు విద్యుత్తు లైట్లను ఆపుచేసి మరి కానిస్టేబుల్‌పై తీవ్రంగా దాడి చేసినట్లుగా సమాచారం. ఈ ఘటనపై తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ప్రమాదంలో మృతి చెందిన సాబ్జాన్

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం గ్రామంలో కరెంటు సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీసీ గురుకుల పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న నూరు సాబ్జాన్(55) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సాబ్జాన్ తన పనులు ముగించుకొని ఇంటికి పోయేందుకు రోడ్డు దాటుతూ ఉండగా, నాయుడుపేట వైపు నుండి చెన్నై వైపు వెళ్తున్న టెంపో వాహనం ఢీకొనింది. దీంతో సబ్జాన్ అక్కడికక్కడే మృతి చెందాడు, ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ అజయ్ కుమార్ సిబ్బందితో ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకుని జరిగిన తీరును పరిశీలించి మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇతని స్వగ్రామం వెంకటగిరి, ఉద్యోగరీత్యా దొరవారిసత్రంలో కాపురం ఉంటున్నాడు. ఎస్ఐ అజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఎస్వీయూ ఎంసిఏ పరీక్షల రీ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు పరిధిలోని ఎం. సి. ఏ. నాల్గవ సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్‌ను పరీక్షల డీన్ ఆచార్య కె. సురేంద్ర బాబు గురువారం విడుదల చేశారు. 28/5/2025 నుంచి 3/6/2025 వరకు జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశామని, వాటిని 24/6/2025 నుంచి 30/6/2025 వరకు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. సంబంధిత వివరాలను ఎస్వీయూ పరీక్షల వెబ్ సైట్లో చూడవచ్చన్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ, శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ఆదర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉమా ముద్దుబాల తెలిపారు. నాలుగవ రోజున సర్వభూపాల వాహనం సందర్భంగా నిర్వహించినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలలో డా.పి.శరత్ చంద్ర బృందం భరతనాట్యం ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమం అనంతరం కళాకారుల బృందాన్ని సంగీత కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉమా ముద్దుబాల సత్కరించారు.

హాకీ క్రీడాకారులకు జెర్సీలు



జెర్సీలను అందజేసిన శంకర్ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎస్ వి యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో హాకీ జూనియర్ బాలికల జట్టుకు అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు శంకర యాదవ్ జెర్సీలను అందించారు. గురువారం ఈ మేరకు హాకీ మైదానంలో బాలికలకు అందజేశారు. ఈనెల 6 నుండి 8వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా భీమవరంలో జరిగే ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్షిప్ లో పాల్గొనడానికి ఎంపికైన హాకీ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి. ఆదిత్య, డి ఎస్ ఏ కోచ్ జీవిఎస్ఎల్ కరుణ, టి.భీమా, హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.